

అభివృద్ధికి గండి..!

- గండికోట అభివృద్ధి అంటూ మారుమోగుతున్న ప్రకటనలు
- ఆ ఇద్దరు నేతల మధ్య గొడవతో ఆగిపోయిన పనులు
- ప్రభుత్వం వెంటనే స్పందించాలని పలువురి వినతి



గండికోటలో అభివృద్ధి పనులకోసం రిత్విక్ కంపెనీ తోలిన కంకర, ఇసుక



బోటు షికారు సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న డ్రైవర్ (వృత్తంలో)

జమ్మలమడుగు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన గండికోటలో అభివృద్ధి పనులకు గండిపడుతోంది. ఒకవైపు జిల్లా అధికార యంత్రాంగం, మరోవైపు రాజకీయ నాయకులు గండికోట అభివృద్ధి అంటూ మూడు నెలల క్రితం ప్రకటనలతో మారుమోగించారు. ఆ తర్వాత ఆగస్టు 1వ తేదీ గండికోటను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించారు. అదేరోజు సాయంత్రం వివిధ ప్రాంతాలకు సంబంధించిన పర్యాటక ప్రదేశాలలో టాస్కీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఇందులో భాగంగా గండికోటలో రూ.78 కోట్లతో వేగవంతంగా అభివృద్ధి పనులు జరుగుతాయని చెప్పారు. ఆ తర్వాత టాస్కీ పనులకు సంబంధించి టెండర్లు జరిగాయి. అందులో ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చెందిన ఎంపీ సీఎం రమేశ్‌కు సంబంధించిన రిత్విక్ కంపెనీ గండికోట అభివృద్ధి పనులకు టెండర్లు దక్కించుకుంది. ఈ మేరకు సెప్టెంబరు 6వ తేదీన రోడ్డు విస్తరణ పనులను లోయ వద్ద నుంచి ప్రారంభించారు. అదే రోజు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వర్గీయులు ఈ పనులను అడ్డగించారు. ఆ తర్వాత సెప్టెంబరు 22వ తేదీ మళ్లీ పనులు ప్రారంభించగా తిరిగి గొడవ చోటు చేసుకుంది. ఎంత చెప్పినా మళ్లీ పనులు చేస్తారా అంటూ గొడవకు దిగి రాళ్లదాడి చేశారు. దీనిపై జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోవడంతో 50 మందికిపైగా పోలీసులు కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి 20 రోజులు దాటుతున్నా టాస్కీ అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. గ్రామస్థుల సమస్యలు పరిష్కరించక పోవడంతోనే టాస్కీ పనులు అడ్డుకున్నారని పైకి చెబుతున్నా.. దీని వెనక అసలు కారణం వేరే ఉందని స్థానికంగా చెప్పుకుంటున్నారు. ఇప్పటికీ ఆ సమస్య కొలిక్కిరాలేదని, దీంతో రిత్విక్ కంపెనీ వారిని పనులు చేయనివ్వరని ప్రచారం జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి గండికోట పర్యాటక ప్రాంతంలో అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అంధకారంలో రోడ్లు


గండికోట బయటి భాగంలో, లోయ పక్కన గతంలో టూరిజం టెంట్లు ఉండేవి. ఇటీవల వాటిని తొలగించారు. గండికోట ప్రధాన రోడ్లు అంధకారంగా మారాయి. కోట ప్రాంగణంలో తాగునీటి సమస్య ఉంది. దీంతో ఆ ప్రాంతం బోసిపోయింది. గండికోటలో బాలిక హత్య కేసు ఇంకా కొలిక్కిరాలేదు. ఇప్పటికీ పాలిగ్రాఫ్ టెస్ట్‌పేరుతో కేసు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అందులో రాజకీయం చోటు చేసుకుందేమోనని ఆరోపణలు ఉన్నాయి.

అసాంఘికాలకు అడ్డాగా..

గండికోటలో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయని ఆరోపణలున్నాయి. బాలిక హత్య జరిగిన తర్వాత గండికోటకు పర్యాటకులు తగ్గారని గ్రామస్థులు అంటున్నారు. అయితే.. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల తదితర ప్రాంతాల నుంచి వచ్చి గండికోటలో బాడుగలకు తీసుకుని, రిసార్ట్‌లలో పేకాట, మట్కా జోరుగా నిర్వహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. మొబైల్ గ్యాంబ్లింగ్ పెరిగింది. ఇటీవల ప్రొద్దుటూరులో పేకాట స్థావరాలపై అధికారులు దాడులు చేయడం, కఠిన చర్యలు ఉండడం వలన జమ్మలమడుగు పట్టణానికి వాహనాల్లో అధికంగా వస్తున్నారు. ముద్దనూరు రోడ్డులో గండికోట వరకు పెన్నానదిలో అనేక ప్రాంతాల్లో పేకాట జరుగుతోంది. గత నెలలో గండికోట ప్రాంతంలో సుమారు 22 మందికిపైగా పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. అయినా ఇక్కడ అసాంఘిక కార్యక్రమాలు ఆగడం లేదని అంటున్నారు.

అనుమతి లేకుండా.. బోటు షికారు

మైలవరం దప్పెర్ల గ్రామం వద్ద నుంచి గండికోట పెన్నాలోయ వరకు బోటు షికారు జోరుగా జరుగుతోంది. ఇక్కడ బోటుషికారుకు అనుమతి లేదు. దీనికితోడు పర్యాటకులను బోటు షికారుకు తీసుకెళ్లే వ్యక్తి డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే పర్యాటకుల భద్రత గాలికే. దీనిపై గండికోట టూరిజం డివిజన్ అధికారి మల్లికార్జున గౌడ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా గండికోటలో బోటు షికారుకు సంబంధించి రాయల్ బోటుకు మాత్రమే పక్కాగా సర్టిఫికెట్లు ఉన్నాయని తెలిపారు. ఏడాది క్రితం అనుమతి లేని బోటును మైలవరం ఇరిగేషన్ శాఖ అధికారులు సీజ్ చేసి వారివద్దే పెట్టుకున్నారన్నారు. ప్రస్తుతం అనుమతి లేని బోటు షికారు ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే డిస్ట్రిక్ట్ టూరిజం అధికారి సురేశ్‌ను గండికోట సమస్యలపై వివరణ కోరగా ఇప్పటికే కొంత అభివృద్ధి జరిగిందని ఇటీవల ఆగిపోయిన పనుల గురించి తనకు తెలియదని అన్నారు.



గండికోట లోయ పక్కన ఫొటోలకు పర్యాటకుల ఫోజులు

వైవీయూను ప్రగతి దిశగా తీసుకెళతా

- నూతన వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు తొలి సేవకుడిగా ఉంటానని వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం వైవీయూ వీసీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం అన్నమయ్య సెనేట్ హాల్లో బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉన్నత విద్యలో సమూల మార్పులను ఆకాంక్షిస్తోందన్నారు. అందులో భాగంగా విశ్వవిద్యాలయాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా పనిచేసానని తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఇక్కడ పనిచేసే ప్రతి ఒక్కరూ లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. పీజీ కోర్సుల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరిగేందుకు సహజ, సామాజిక మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం యూజీసీ నెట్ పేపర్-1 కోసం శిక్షణ ఇస్తామన్నారు. విశ్వవిద్యాలయానికి నిధుల పరంగా బలోపేతం చేసేందుకు సీఎస్ఆర్ ఫండ్స్ తెచ్చేందుకు త్రిమెన్ కమిటీని నియమించనున్నామన్నారు. ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పద్మ, ప్రధానాచార్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన బెల్లంకొండ రాజశేఖర్‌ను పలువురు అభినందించారు.

ప్రజా సమస్యలు అలక్ష్యం చేయొద్దు

- జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను సంబంధిత అధికారులు అలక్ష్యం చేయక వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున అర్జీదారులు హాజరై తమ సమస్యలతో కూడిన అర్జీలను జాయింట్ కలెక్టర్, డీఆర్వో, అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారాలు చూపాలన్నారు. అధికారులే స్వయంగా వెళ్లి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీ ఓపెన్ కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అర్జీలపై నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని, చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు.

ఈ సందర్భంగా చక్రాయపేట, కుప్పంతాండా గ్రామానికి చెందిన ఉపేంద్ర నాయక్ ఫిర్యాదు చేస్తూ తమ గ్రామంలో నెట్‌వర్క్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వేంపల్లి మండలం దూపాడుకు చెందిన పార్వతి తమ వ్యవసాయ భూమిని సర్వేచేసి, ఆన్‌లైన్‌లో ఎక్కించాలని అర్జీ సమర్పించారు. కడప నగరానికి చెందిన విజయలక్ష్మి ఫిర్యాదు చేస్తూ తప్పుడు రికార్డులు సృష్టించి తనపేరున ఫోర్జరీ సంతకాలతో డ్రిప్ మంజూరు చేశారని అన్నారు. తనకు సంబంధం లేని ఈ వ్యవహారంపై మండల, డ్వామా అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

● ఆవేదన

రాజకీయ వేధింపులు తగదు

- అంగన్వాడీ వర్కర్స్ రాష్ట్ర నేతలు

కడప మారుతీనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలపై ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు రాజకీయకక్షతో లేనిపోని ఆరోపణలు చేస్తూ మెమోలు ఇప్పించడం, రాజీనామాలు చేయాలని వత్తిళ్లు చేయడం దుర్మార్గమని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఏఐటీయూసీతో కలసి సోమవారం కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో పాటు ఏటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటి వేణుగోపాల్, ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో జీతాల పెంపు కోసం 40 రోజుల పాటు అంగన్వాడీ కార్యకర్తలు నిర్విరామ సమ్మె చేశారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఆ మేరకు కనీస వేతనం రూ.28వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన హెల్పర్స్‌కు ప్రమోషనర్లు కల్పించి ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలన్నారు. పెండింగులో ఉన్న అంగన్వాడీ సెంటర్ల అద్దెలు, టీఏ, డీఏ బిల్లులు తక్షణమే ఇవ్వాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు చెన్నమ్మ, విజయ, సుజాతమ్మ, నాగలక్ష్మి, పారాదేవి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు

● డిమాండ్

నీటి ప్రాజెక్టులను పట్టించుకోండి

- భారతీయ కిసాన్ సంఘ్



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి తదితరులు

కడప రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను, రైతులను పట్టించుకోలేదని.. కూటమి ప్రభుత్వమైనా సాగునీటి ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.జనార్దన్‌రెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు మండలాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో జడ్పీ కార్యాలయానికి చేరుకుని అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాజోలి రిజర్వాయర్ నిర్మాణానికి టెండర్ పూర్తిచేసి ఆ తరువాత పనులు చేపట్టలేదన్నారు. అలాగే పెద్దముడియం మండలంలోని రాజోలి రిజర్వాయర్ ముంపు గ్రామాల రైతుల భూములను మూడు సంవత్సరాల క్రితమే ప్రభుత్వం తీసుకుని ఇంతవరకు పరిహారం చెల్లించలేదన్నారు. దీంతో రైతు అవసరాలకు భూమి తాకట్టుపైన బ్యాంకుల ద్వారా అప్పు రాక, భూములు అమ్ముకోలేక ఇక్కట్లకు లోనవుతున్నారన్నారు. రాజోళి రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణ పనులను తక్షణం చేపట్టి ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం నియోజకవర్గాలలోని 90,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నారు. మైలవరం ప్రాజెక్టుకు సరైన పంట కాలువలను ఏర్పాటు చేయాలని, వామికొండ, సర్వరాయసాగర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ ప్రాజెక్టుల పంట కాలువల నిర్మాణం వెంటనే చేపట్టి సాగునీటిని అందించాలన్నారు. గాలేరు నగరి కాలువ పెండింగ్ పనులను కూడా పూర్తిచేయాలన్నారు. కడప, ఎర్రగుంట్ల మార్కెట్ యార్డుల ద్వారా ఉల్లి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రైవేట్ వ్యాపారుల దోపిడీని అరికట్టాలన్నారు. జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు సెంటర్‌ను ఏర్పాటు చేసి పత్తి రైతులకు గిట్టుబాటు ధరను కల్పించాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

● ఆందోళన

దాడిచేసిన వ్యక్తిని అరెస్ట్‌చేయాలి

- ఎంఎస్పీ, ఎంఆర్పీఎస్



కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వెళుతున్న ఎంఎస్పీ, ఎంఆర్‌పీఎస్ నేతలు

కడప మారుతీనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కోర్టులో వాదనలు వింటున్న సమయంలో ఆయనపై షూ విసిరిన రాకేష్‌కిశోర్ అనే వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్పీ) నేత గుండాల ఈశ్వరయ్య, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేశ్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆ దాడి వెనుక గల శక్తులను గుర్తించి వారికి శిక్షపడేలా స్వతంత్ర దర్యాప్తు చేయాలన్నారు. జస్టిస్ గవాయిపై జరిగిన దాడికి నిరసిస్తూ ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మహావీర్ సర్కిల్ వద్ద గల దేశ మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన బీఆర్ గవాయి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కావడం కొన్ని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేక అహంకార పూరితంగా దాడికి తెగబడడం దారుణమన్నారు. ఇది ఏకంగా రాజ్యాంగంపై జరిగిన దాడి అన్నారు. ఆయనపై దాడికి పాల్పడ్డ వ్యక్తి మీద తక్షణమే కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. ఆ దాడి వెనుక ఉన్న అదృశ్య శక్తులను గుర్తించి వారికి శిక్ష పడేలా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేఎన్ రాజు, జిల్లా అధికార ప్రతినిధి మాతయ్య, నేతలు నరసింహులు, ఉత్తయ్య, చిన్నయ్య, నాగేశ్వరరావు, చరణ్, బాలయ్య, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్టిఫికెట్ల పరిశీలన

కడప కలెక్టరేట్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని మెడికల్ ఆఫీసర్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, ఎఫ్ఎన్ఓ శానిటరీ అటెండర్, టీబీ హెల్త్ విజిటర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి 15వ తేదీ ఉదయం 10గంటలకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నారు. ఎంపికైన వారి పేర్లు www.kadapa.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉన్నాయని వారందరూ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తీవ్ర విషాదం

- ఏడాదిన్నర బిడ్డతో కలసి రైలుకింద పడిన దంపతులు
- అదే ఇంటిలో గుండెపోటుతో వృద్ధురాలు మృతి
- గంటల వ్యవధిలో ఒకే ఇంట్లో నలుగురు మృత్యువాత



మృతులు శ్రీరాములు, బిడ్డతో శిరీష (ఫైల్‌ఫొటోలు)

కడప క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశం ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. ఏడాది బిడ్డతో పాటు భార్యాభర్త కడప రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్సురైలు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలిసి వారి కుటుంబంలోని వృద్ధురాలు గుండెపోటుతో మృతిచెందారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు..

కడప నగరంలోని శంకరాపురంలో నివాసముంటున్న రామకృష్ణ, పద్మావతిల కుమారుడు శ్రీరాములు మూడేళ్ల క్రితం మృత్యుంజయకుంటకు చెందిన శిరీషాను వివాహమాడాడు. వీరికి రిత్విక్ అనే ఏడాదిన్నర వయసు కుమారుడు ఉన్నాడు. శ్రీరాములు చెన్నూరు బస్టాండు సమీపంలో ఓ వైద్యురాలి వద్ద ఫార్మసీ విభాగంలో విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి 9.30గంటలకు ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో మద్యం సేవించి వచ్చినందుకు కుటుంబ సభ్యులు, పెద్దలు శ్రీరాములును మందలించారు. దీంతో శ్రీరాములు ఇంట్లో వాళ్లను అడిగి వంద రూపాయలు తీసుకుని భార్య, కొడుకును వెంటపెట్టుకుని వీధిలోకి వచ్చాడు. నడుచుకుంటూ వెళుతున్న శ్రీరాములును ఓ స్నేహితుడు పలకరించి ఎక్కడకి వెళుతున్నావని ప్రశ్నించగా.. రైల్వేస్టేషన్‌కు పోతున్నామని చెప్పాడు. దీంతో ఆ వ్యక్తి శ్రీరాములు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఇంట్లో వాళ్లు శ్రీరాములుకు ఫోన్ చేయగా అది బెడ్‌రూమ్‌లో ఉన్నట్టు గుర్తించారు. బెడ్‌రూములోకి వెళ్లి చూడగా సెల్‌ఫోనుతో పాటు ఆ ముగ్గురికి సంబంధించిన బంగారు ఆభరణాలన్నీ అక్కడే ఉన్నాయి. ఈ విషయం తెలిసి ఆందోళనకు గురై అప్పటికే తీవ్ర అనారోగ్యంతో ఉన్న శ్రీరాములు నానమ్మ వెంకటసుబ్బమ్మ (71) గుండెపోటుకు గురయ్యారు. కుటుంబసభ్యులు దగ్గరలోని డాక్టరును పిలిపించి పరీక్ష చేయించగా అప్పటికే వృద్ధురాలు మృతిచెందిందని చెప్పారు. మరోవైపు శ్రీరాములు (27), భార్య శిరీష(23) కుమారుడు రిత్విక్‌తో కలసి ఆటోలో రైల్వేస్టేషనుకు చేరుకున్నారు. కడప రైల్వేస్టేషన్ నుంచి నుంచి కమలాపురం వైపు 50 మీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లారు. రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని గూడ్సు రైలు రాగానే పట్టాలపైన పడుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఏడాదిన్నర వయసున్న కొడుకు కూడా వారితో పాటు మరణించడం మరింత విషాదాన్ని నింపింది. ఈ ఘటన ఆదివారం రాత్రి సుమారు 11గంటల సమయంలో చోటు చేసుకుంది. గంటల వ్యవధిలో ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. బిడ్డతో కలసి ఆత్మహత్యకు పాల్పడిన దంపతుల మృతదేహాలను కడప రిమ్స్ మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాలను అప్పగించారు. కడప రైల్వే సీఐ సుధాకర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గుండెపోటుతో మరణించిన శ్రీరాములు నాయనమ్మ (ఫైల్‌ఫొటో)

ధర్నా చేస్తే.. టమోటాలు కొనాలా...?!

- తగ్గేదేలేదంటూ అధికారులకు వ్యాపారుల హెచ్చరికలు
- కడప-బెంగళూరు జాతీయ రహదారిపై రైతుల ధర్నా
- స్తంభించిన ట్రాఫిక్
- బారులు తీరిన వాహనాలు
- మార్కెట్ యార్డు వద్ద ఉద్రిక్తత
- పోలీస్, రెవెన్యూ అధికారుల జోక్యంతో ధర్నా విరమణ




జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు, (ఇన్‌సెట్లో) పోలీసులతో వాదిస్తున్న రైతులు

గుర్రంకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్‌యార్డు వద్ద సోమవారం జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలంటూ వందలాది మంది రైతులు వ్యాపారుల తీరును నిరసిస్తూ కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. సుమారు రెండు గంటలకు పైగా ధర్నా చేయడంతో వాహనాలు బారులు తీరి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. రైతులు ధర్నా చేస్తున్నట్లు తెలియడంతో వాల్మీకిపురం ఎస్ఐ చంద్రశేఖర్ రైతుల వద్దకు చేరుకొని మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంతో వ్యాపారులు దోచుకొంటున్నారని, అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని చెప్పారు. జాక్‌పాట్ విధానాన్ని ప్రశ్నించే రైతుల పట్ల వ్యాపారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఎస్ఐకు తెలిపారు. దీంతో రైతులు టమోటాకు ధరలున్న సమయంలో లక్షలాది రూపాయలు నష్టపోతునట్లు వివరించారు. అలాగే టమోటా పంటకు ధరలు లేని సమయంలో జాక్‌పాట్‌తో పెట్టుబడులు కూడా రాక రైతన్నలు అప్పుల పాలవుతున్నట్లు చెప్పారు. మార్కెట్‌యార్డులో జాక్‌పాట్ విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేయాలని, అప్పటి వరకు ధర్నాను విరమించేది లేదని వందలాది మంది రైతులు జాతీయ రహదారిపై కూర్చొని ధర్నా నిర్వహించారు.

ధర్నా చేస్తే కొనాలా..?

జాక్‌పాట్ విధానానికి వ్యతిరేకంగా రైతులు ధర్నా చేస్తే వ్యాపారులు టమోటాలు కొనాలా...అంటూ వ్యాపారులు అధికారులను హెచ్చరించారు. రైతులు ధర్నా చేస్తున్న సమయంలో మార్కెట్‌శాఖ కార్యదర్శి కుమార్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ నౌషాద్ అలీలు వ్యాపారులతో మాట్లాడేందుకు వెళ్లారు. వ్యాపారులు జాక్‌పాట్ విధానాన్ని మానుకోవాలని అధికారులు సూచించడంతో రైతులు ధర్నా చేస్తే మండీల్లో టమోటాలు ఎలా కొంటామని..? రైతులు టమోటాలు ఎక్కడ అమ్ముకొంటారో చూస్తామంటూ అధికారులకు సవాల్ విసిరారు. దీంతో ఆగ్రహించిన రైతులు అధికారులు, కమిటీ సభ్యులను నిలదీశారు. మార్కెట్ యార్డు వ్యాపారుల సొంత జాగీరా...? అధికారుల నిర్లక్ష్యంతోనే వ్యాపారులు రెచ్చిపోతున్నారని... రైతులకు అన్యాయం చేసే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలంటూ నిలదీశారు. అనంతరం తహశీల్దార్ లక్ష్మీప్రసన్న, ఎస్ఐ చంద్రశేఖర్, కార్యదర్శి రైతులకు సర్ధిచెప్పి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో శాంతించారు.

మార్కెట్ యార్డు వద్ద ఉద్రిక్తత

మార్కెట్ యార్డు వద్ద వందలాది మంది రైతులు జాతీయ రహదారిపై ధర్నా చేయడంతో కొంత సమయం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని అధికారులు, పాలకవర్గ సభ్యులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రైతులకు పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకొంది. దీంతో కొంత సమయం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

- చిత్తూరు పోక్సో కోర్టులో తీర్పు



నిందితుడు ప్రసాద్ (ఫైల్ పొటో)

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చిన్నారి విషయంలో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష అమలు చేసినట్లు చిత్తూరు పోక్సో కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. వివరాల్లోకెళ్తే.. మదనపల్లెలో చిన్నారిపై 2021 మార్చి 3న బసినికొండ గ్రామానికి చెందిన పి.ప్రసాద్ (23)అనే యువకుడు ఓ బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. బాధితురాలు తల్లి మార్చి 5న మదనపల్లె తాలుకా పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. అప్పట్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు ప్రసాద్ చేసిన నేరం రుజువు కావడంతో చిత్తూరు జిల్లా పోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.8వేలు జరిమానా విధించింది. తీర్పు వెలువడగానే బాధితురాలి కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసులో విచారణాధికారి రవిమనోహరాచారి, అప్పటి మదనపల్లె డీఎస్పీ కేసు నమోదు చేసిన అధికారి ఎస్ఐ దిలీప్‌కుమార్, ప్రస్తుత మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, తాలుకా సీఐ కళా వెంకటరమణ, కోర్టు కానిస్టేబుల్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

బాలికలను వివక్షతతో చూడకూడదు

- జిల్లా విస్తృత ఆరోగ్య విద్యాధికారి దేవశిరోమణి

రాయచోటిటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బాలికలను వివక్షతతో చూడకూడదని మగ పిల్లలతో సమానంగా చూసుకోవాలని జిల్లా విస్తృత ఆరోగ్య విద్యాధికారి (డెమో) దేవశిరోమణి పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సోమవారం రాయచోటి మండల పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలపై ఉన్న అసమానత్వం, చిన్నచూపు, లింగ వివక్షత సమూల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ హెచ్ఈవో కె.బలరామరాజు మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ ఇరువురు సమానమేనని, లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే చట్టరీత్యా కఠిన శిక్షలు, జరిమానా విధించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుమతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్, హెచ్ఈ రాజగోపాల్, సీహెచ్‌వో రామకృష్ణ యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకం



రైల్వేకోడూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు బాపట్ల జిల్లాలోని పేటూరులో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో రైల్వేకోడూరుకు చెందిన విద్యార్థిని టి.సోహిత అండర్-14, 38 ప్లస్ విభాగంలో తన ప్రతిభను ప్రదర్శించి బంగారు పతకాన్ని సాధించినట్లు ఎస్‌కే స్పోర్ట్స్ అకాడమి కోచ్ ఎస్‌కే మౌలా సోమవారం తెలిపారు. నవంబర్ నెలలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు సోహిత ఎంపిక అయినట్లు తెలిపారు.

ప్రేమ వేధింపులతో బాలిక మృతి

- పూలికుంటలో దారుణం

గాలివీడు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలికుంట పంచాయతీ గుంటికాడపల్లికు చెందిన బాలిక (14) ప్రేమ వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న దారుణ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తరచూ 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను.. నాతో మాట్లాడాలి' అంటూ వేధింపులకు గురి చేసేవాడు. దీంతో మనస్థాపానికి గురైన బాలిక అక్టోబరు 9న తమ పొలం కోసం ఉంచిన గడ్డి మందును సేవించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో అక్టోబరు 13వ తేదీ తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. ఈ ఘటనపై గాలివీడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఎంపీపీ రాజీనామా



సీఈవోకు రాజీనామా పత్రం అందజేస్తున్న ఎంపీపీ అనసూయమ్మ

తంబళ్లపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఎంపీపీ అనసూయ నారాయణరెడ్డి సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ నాయకులతో కలిసి చిత్తూరులోని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడుకు తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఆమె మాట్లాడుతూ..విదేశాల్లో ఉన్న తమ పిల్లలను చూసేందుకు భర్త నారాయణరెడ్డితో కలిసి వెళ్తున్నామని సుమారు ఆరు, ఏడు నెలలు అక్కడే ఉంటామన్నారు. ఈ సమయంలో అభివృద్ధికి ఆటంకం కలుగకుండా వేరొకరిని నియమించాలని సీఈవోను కోరుతూ.. తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

బైక్ ప్రమాదంలో యువకుడు మృతి



మృతిచెందిన యువకుడు (ఫైల్)

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బైక్ నడుపుతూ కింద పడిన ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. సోమవారం మదనపల్లె పట్టణం, అమ్మచెరువు మిట్టకు చెందిన పవన్‌కుమార్, పల్లవి దంపతుల నీరుగట్టువారిపల్లెలోని మాయాబజార్‌లో సెల్‌షాపు నిర్వహిస్తున్నారు. వారి కుమారుడు అజయ్‌దేవా(19) ఫ్లిప్‌కాట్ పనులు చేస్తారు. ఇందులో భాగంగా మదనపల్లె టౌన్ నుంచి వెళుతుండగా అమ్మచెరువుమిట్ట వద్ద బైక్ స్కిడ్ అయి ప్రమాదం జరిగింది. ఇందులో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

వృద్ధుడికి పాముకాటు



పాముకాటుతో చికిత్స పొందుతున్న వృద్ధుడు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పాముకాటుకు వృద్ధుడు గురైన సంఘటన నిమ్మనపల్లె మండలంలో చోటు చేసుకుంది. సోమవారం సాయంత్రం నిమ్మనపల్లె మండలం, గారబురుజు గొల్లపల్లెకు చెందిన వెంకటప్ప కుమారుడు గుర్రప్ప (50) మేకలను మేపుతుండగా పాముకాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. ఈ మేరకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకొంటున్నాడు.

ఆర్టీసీ డ్రైవర్ నిర్వాకంతో..

మహిళకు విరిగిన కాలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఓరంపాడు క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో పొరపాటున మహిళ కింద పడి కాలుకు తీవ్ర గాయమై.. ఆసుపత్రిపాలైందని బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీ కమ్మపల్లె హరిజనాడ గ్రామానికి చెందిన దాసరి అచ్చమ్మ గ్రామంలోని మరికొందరితో కలిసి రైల్వేకోడూరుకు వెళ్లే క్రమంలో బస్సు కోసం వేచి ఉండగా ఏపీ39యూజీ 8251 నంబరు గల బస్సు రావడం జరిగింది. అయితే బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో డ్రైవర్ స్టాప్‌లో కాకుండా మరికొంత దూరంలో నిలపడం జరిగింది. బస్సు వద్దకు వెళ్లిన అచ్చమ్మ బస్సు మెట్లు ఎక్కగా ఆమెతోపాటు వచ్చినవారు ఎక్కకపోవడంతో తిరిగి దిగే క్రమంలో బస్సు ముందుకు కదలడంతో దీంతో ఆమె కిందపడి ఎడమకాలు తీవ్ర గాయాలపాలైంది. ఇది గమనించిన ప్రయాణికులు కదులుతున్న బస్సును ఆపి డ్రైవర్, కండక్టర్‌లను మందలించడం జరిగింది. గాయపడిన బాధితురాలిని 108 ద్వారా రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వెళ్లాలని సూచించడంతో రైల్వేకోడూరులో ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతుందని తమకు న్యాయం చేయాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పథకంద్వారా ఉచిత బస్సు పెట్టినప్పటి నుంచి బస్సు డ్రైవర్లు, కండక్టర్ల తీరు తీవ్ర అభ్యంతకరంగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎగువ చెన్నామర్రి సమీపంలో చిరుత

- కుక్కను చంపి...

కురబలకోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ ఎగువ చెన్నామర్రి గ్రామ సమీపంలో చిరుత సంచారం కలకలం రేపింది. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు పలుమార్లు సంఘటనలు వెలుగు చూశాయి. కాగా హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతం సమీపంలో రైతు నారాయణరెడ్డి తన పొలంలో ఆదివారం రాత్రి కుక్కను కాపలాగా పెట్టి ఇంటికి వచ్చేశాడు. సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు కుక్క కళేబరాన్ని చూసి చుట్టుపక్కల ఉన్న రైతులను పిలిచాడు. చిరుత దాడిలోనే కుక్క చనిపోయిందని, అక్కడ చిరుత పాదముద్రలు ఉన్నాయని రైతులు తెలిపారు. వెంటనే వారు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. కొద్దిరోజుల క్రితం ఇదే ప్రాంతంలో రైతు రెడ్డిశేఖర్‌రెడ్డికి చెందిన కుక్కను కూడా చిరుత లాక్కెళ్లిన ఘటన జరిగింది. ఈ ప్రాంతంలో చిరుత సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

- దరఖాస్తులకు ఈ నెల 30 చివరి తేది



కలికిరి సైనిక్ స్కూల్

కలికిరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కలికిరి సైనిక్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే అర్హత పరీక్షకు దరఖాస్తులు పంపుకోవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. కలికిరితో పాటు విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రవేశాలకు కూడా దరఖాస్తులు పంపుకోవచ్చు. ఇవి రెండూ కాకుండా ఆదానీ వరల్డ్ స్కూల్ (నెల్లూరు), నేతాజీ సైనిక్ స్కూల్ (కృష్ణా), వెరిటాస్ సైనిక్ స్కూల్ (తిరుపతి) ఈ మూడు ప్రైవేట్ (అప్రూవ్డ్) సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు కూడా అవకాశం కల్పించారు. ఆరు, తొమ్మిది తరగతుల్లో మాత్రమే కొత్తగా ప్రవేశాలుంటాయి. ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తులు పంపుకోవాల్సి వుంటుంది. జనవరిలో ఎన్టీఏ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. కేంద్రాలు, పాఠశాల వారీగా అందుబాటులో వున్న సీట్ల వివరాలను ఎన్టీఏ నోటీస్‌పై చేసింది. సాధారణంగా అక్టోబరులో దరఖాస్తులను ఆహ్వానించడం, జనవరిలో అర్హత పరీక్షలు నిర్వహణ, అనంతరం మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇంటర్వ్యూలు లాంటి ఆనవాయితీలుండగా గతేడాది రెండు నెలలు ఆలస్యంగా ప్రక్రియ కొనసాగింది. అయితే ఈ ఏడాది తిరిగీ ఆనవాయితీ ప్రకారమే షెడ్యూలు ప్రకటించారు. ఈ నెల 30న ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించిన అనంతరం అందులో ఏవైనా మార్పులు, చేర్పులుంటే సరిదిద్దుకోవడానికి 31న అవకాశం కల్పించారు. ఆ తరువాత వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు జారీ చేస్తారు. వివరాలేవైనా అవసరమైతే పనివేళల్లో సంప్రదించడానికి ఎన్టీఏ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసింది. 011-40759000, 011-69227700 నంబర్లను సంప్రదించవచ్చు.

అర్హతలు

ఆరవ తరగతి ప్రవేశాలకు 2026 మార్చి 31 నాటికి 10 నుంచి 12 ఏళ్ల వయసుండాలి. అంటే 2014 ఏప్రిల్ 1 నుంచి 2016 మార్చి 31 మధ్య జన్మించి వుండాలి. తొమ్మిదవ తరగతి ప్రవేశాలకు 13-15 ఏళ్ల మధ్య వయసుండాలి. అంటే 201 ఏప్రిల్ 1 నుంచి 2013 మార్చి 31 మధ్య జన్మించి వుండాలి. దరఖాస్తు రుసుం జనరల్, డిఫెన్స్ కేటగిరీ విద్యార్థులకు రూ.850, ఎస్సీ, ఎస్టీలకు రూ.700 వంతున చెల్లించాలి. ఆరవ తరగతికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు, తొమ్మిదవ తరగతికి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

అందుబాటులో వుండే సీట్లు

కలికిరి సైనిక్ స్కూల్‌లో ఆరవ తరగతిలో మొత్తం 105 సీట్లున్నాయి. అందులో స్థానికత కింద (ఏపీ విద్యార్థులకు) బాలురుకు 66, బాలికలకు ఐదు సీట్లు, మిగిలినవి ఇతర రాష్ట్రాల వారికి కేటాయించారు. కోరుకొండలో మొత్తం 90 సీట్లుండగా స్థానికత కింద 60, ఇతరులకు 30 సీట్లు కేటాయించారు. తొమ్మిదవ తరగతిలో కలికిరిలో 10 సీట్లుండగా అందులో రెండు మాత్రం ఇతర రాష్ట్రాలకు కేటాయించారు. కోరుకొండలో 23 సీట్లుండగా అందులో 7 సీట్లు ఇతర రాష్ట్రాలకు కేటాయించారు. ఇక ప్రైవేట్ అప్రూవ్డ్ స్కూళ్లలో ఆదాని వరల్డ్ స్కూల్‌లో మొత్తం 80 సీట్లు, నేతాజీలో బాలురుకు మాత్రమే 120 సీట్లున్నాయి. ఇక తిరుపతి వెరిటాస్‌లో 150 సీట్లుండగా ఆదానిలో మాత్రమే 9వ తరగతిలో 30 సీట్లున్నాయి.

అర్జీలు పరిష్కరించడమే మా పనా...!

- ఎన్నిసార్లు తిరుగుతావంటూ అర్జీదారుడిపై డీటీ ఆగ్రహం



సబ్ కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్లో అర్జీదారుడు అజీజ్‌తో మాట్లాడుతున్న డీటీ శాంతమ్మ

మదనపల్లె టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారం చూపాలని స్వయంగా సీఎం చంద్రబాబు కలెక్టర్లను ఆదేశించిన విషయం తెలిసిందే. కానీ మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో మాత్రం ఓ డీటీ అర్జీదారుడిపై అందరి ముందే ఆగ్రహం వ్యక్తం చేసింది. అర్జీలు పరిష్కరించడమే మా పనా..? ఎన్నిసార్లు తిరుగుతావంటూ పీజీఆర్ఎస్ హాల్లోనే అందరి ముందు అర్జీదారున్ని నిలదీసింది. వివరాల్లో వెళితే.. సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో డీఏవో నిర్మలదేవి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా వి.కోట మండలం తోటకనుమకు చెందిన అజీజ్‌సాహెబ్ మాట్లాడుతూ కుప్పం బ్రాంచ్ కెనాల్ కోసం తమ భూమిని తీసుకున్న ప్రభుత్వం ఇంత వరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. దీనిపై మూడు నెలల నుంచి తిరుగుతున్నా తమ ఫైలు కదలలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై హెచ్ఎన్ఎస్ఎస్ డీటీ శాంతమ్మ వచ్చి మాట్లాడుతూ తమకు పనిభారం ఎక్కువగా ఉందని, అర్జీలు చూడటమే తమ పనా అంటూ, ఎన్నిసార్లు తిరుగుతావంటూ అర్జీదారున్ని ప్రశ్నించింది. దీంతో అవాక్కయిన అర్జీదారుడు మీడియాతో తనగోడు వెళ్లబోసుకున్నాడు. ఈ విషయమై డీఏవో నిర్మలదేవి మాట్లాడుతూ అర్జీదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, అజీజ్ ఫైలు తొందరగా పూర్తి చేసి ఇవ్వాలని డీటీ శాంతమ్మకు సూచించారు. కురబలకోట మండలానికి చెందిన పగడాల గోపాలకృష్ణ భూమికి సంబంధించి మ్యుటేషన్ చేయడానికి సబ్‌కలెక్టరేట్‌లోని ఓ క్లర్కు తిప్పుకుంటూనే ఉన్నాడని బాధితుడు డీఏవోకు ఫిర్యాదు చేశాడు. చేనేత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత విద్యుత్ పథకాన్ని ఇంత వరకు అమలు చేయలేదని చేనేత కార్మికులు అర్జీ అందజేశారు. మదనపల్లె ఎంపీడీవో వైసీపీ సర్పంచ్‌లను వేధిస్తున్నాడని వైసీపీ నాయకులు డీఏవోకు ఫిర్యాదు చేశారు. వీటితో పాటు 52 మంది వివిధ సమస్యలతో డీఏవోకు అర్జీలు అందజేశారు.

అలసత్వం చేయొద్దు

- అదనపు ఎస్పీ వెంకటాద్రి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడం లో అధికారులు ఏమాత్రం అలసత్వం చేయొద్దని, చట్ట పరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో అదనపు ఎస్పీ నేరుగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా తిలకించి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సదరు అర్జీలపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే విచారణ జరిపి చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. అలాగే తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను వెంటనే జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. అంతేగాక దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత ఇచ్చి వేగంగా సమగ్ర విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రానికి రాలేని బాధితులు వారి దగ్గరలోని పోలీసుస్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్డిపల్లె సమీపంలో గల హంద్రీనీవా కాలువలో ఆదివారం గల్లంతైన విద్యార్థి సాయికిరణ్ మృతదేహాన్ని సోమవారం ఫైర్ సిబ్బంది బయటకు తీశారు. మృతుడి తల్లిదండ్రులు సురేశ్, సరళలు మాట్లాడుతూ ఆదివారం కూడా క్లాసులు నడపడంతోనే తమ అబ్బాయి మృత్యువాత పడ్డారని ఆరోపించారు. వెంటనే మదనపల్లె వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలంలోకి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



హంద్రీనీవా కాలువలో పడి మృతి చెందిన విద్యార్థి సాయికిరణ్

శ్రమదాన స్ఫూర్తి.. సిమెంటు రోడ్డు పూర్తి

- నిన్నటివరకు మోకాళ్లలోతు నీరు
- నేడు సిమెంటు రోడ్డుతో సమస్య పరిష్కారం
- మందరం రాచపల్లెలో స్వయంగా రోడ్డు వేసుకున్న గ్రామస్థులు

రాజంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో ఆదర్శంగా ఉండే మందరం రాచపల్లె గ్రామస్థులు స్వయంగా శ్రమదానం చేసి సిమెంటు రోడ్డు వేసుకుని ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. రాజంపేట-చిట్వేలి రోడ్డు మార్గంలో ప్రధాన రహదారి పక్కన మందరంపల్లె రాచపల్లె గ్రామం ఉంది. ఆ గ్రామంలో సుమారు 70 గృహాలు ఉన్నాయి. అయితే గత పదేళ్లుగా గ్రామంలో మురికినీటి సమస్య ఇబ్బందికరం చేస్తోంది. గ్రామంలో గతంలో సిమెంటు రోడ్డు వేసుకున్నా రోడ్డు గుంతలుగా మారడంతో వర్షపు నీరంతా గ్రామ రహదారిలో చేరి మురికి మయంగా మారింది. అటు పోవాలన్నా ఇటు రావాలన్నా గ్రామవీధిలో నిలబడ్డ మురికినీటితో చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామ రోడ్డుకు గత వైసీపీ ప్రభుత్వం మొండిచేయి చూపింది. ఈ సమయంలో ఆ గ్రామానికి చెందిన నాయకుడు సంపతి ఉమాపతి ఆధ్వర్యంలో శ్రమదానం చేసి సిమెంటు రోడ్డు వేశారు. ప్రస్తుతం ఉమాపతి తమిళనాడు రాష్ట్రం ఓసూరులో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. గ్రామ సమస్యను గుర్తించి ఇటీవల దసరా సెలవులు కావడంతో తోటి గ్రామస్థులు, బంధువులతో కలిసి దాతలు పులిగోరి చంద్రారెడ్డి తదితరుల సహకారంతో సిమెంటు పోగు చేశారు. తానే స్వయంగా ఇసుక, కంకర తదితర ఖర్చులు పెట్టుకుని గ్రామస్థుల సహకారంతో వారికి వారే మేస్త్రిని పెట్టుకుని సుమారు వంద మీటర్ల మేర నీరు నిలిచే ప్రాంతాన్ని ఎత్తుగా లేపి సిమెంటు రోడ్డు వేశారు. దీంతో గ్రామంలో మురికినీటి సమస్య పదేళ్ల తర్వాత తీరింది. ఈ సందర్భంగా సంపతి ఉమాపతి మాట్లాడుతూ గతంలో తాము శ్రమదానం ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, ప్రస్తుతం సిమెంటు రోడ్డు కూడా అదే స్ఫూర్తితో వేసినట్లు తెలిపారు. గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన స్ఫూర్తితో గ్రామంలో బస్సుషెల్టర్, రోడ్లు, బడి, గుడి ఇతర అబివృద్ధి కార్యక్రమాలను చేశామని తెలిపారు.



నిన్న గ్రామం నట్టనడిరోడ్డులో నిలిచి ఉన్న మురుగునీరు



నేడు శ్రమదానంతో పూర్తి అయిన సిమెంట్ రోడ్డు

ఆ రోడ్లపై ప్రయాణం.. నరకం!

- ప్రొద్దుటూరు పట్టణంలో పలు ప్రధాన రోడ్లపై గుంతలు
- మైదుకూరు రోడ్డు, ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో..
- మరమ్మతులు కూడా చేపట్టని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

ప్రొద్దుటూరు , అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని పలు ప్రధాన రోడ్లపై గుంతలు పడి ప్రయాణికులకు నరకాన్ని చూపుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇక ద్విచక్ర వాహనదారులు, ఆటోల పరిస్థితి అధ్వానంగా తయారైంది.



ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో పడిన గుంతలు



ప్రొద్దుటూరు పట్టణంలోని మైదుకూరు రోడ్డు దారుణంగా ఉంది. నిత్యం వేలాదిగా వాహనాలు ఆ రోడ్డుపై ప్రయాణిస్తుంటాయి. గత కొన్నేళ్లుగా మైదుకూరు రోడ్డు విస్తరణకు నోచుకోక దుర్భంగా మారింది. దీనికి తోడు రోడ్డుకు ఇరువైపులా కాలువలు లేక వర్షాలు వస్తే రోడ్లపై వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తుంటాయి. ఇటీవల కొత్తపల్లె పంచాయతీ అధికారులు మైదుకూరు రోడ్డుకు ఒకవైపు మాత్రమే కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. అదికూడా పూర్తి స్థాయిలో నిర్మాణం కాక అక్కడక్కడ కాలువ పెండింగ్‌లో ఉండటం వలన రోడ్డుపైకి కాలువలోని మురుగు నీరంతా ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. ఇక



మైదుకూరు రోడ్డులోని హోండా షోరూం వద్ద ఏర్పడిన గుంత

ఆర్టీసీ బస్టాండ్ నుంచి కొత్తపల్లె బైపాస్ సర్కిల్ వరకు గుంతలతో దారుణంగా తయారై.. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కానీ ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు కొన్ని గుంతలలో రాళ్లు పోసి పూడ్చే ప్రయత్నం చేశారు తప్ప రోడ్డుకు ప్యాచింగ్ పనులు కూడా చేపట్టలేదు. మైదుకూరు రోడ్డు నుంచి ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు వెళ్లే మార్గం గుంతలమయమై దుర్భరంగా ఉంది. ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు విస్తరణకు నిధులు విడుదలైనా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్స్ షిఫ్టింగ్ పనులు ఏడాది కాలం పైగా ఆగిపోయాయి. పొట్టిపాడు రోడ్డు చిన్నశెట్టి పల్లె రోడ్లలో గుంతలకు ప్యాచింగ్‌లు కూడా వేయకపోవడంతో ఆ రోడ్లపై ప్రయాణం అంటే నరకాన్ని తలపిస్తోందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు ఏమన్నారంటే: రోడ్లపై పడిన గుంతల విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరగా గుంతలు పూడ్చడనికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, త్వరలో టెండర్లు పిలిచి రోడ్లపై ప్యాచింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు.

చట్టపరిధిలో న్యాయం చేయండి

కడప క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో అదనపు ఎస్పీ మాట్లాడి ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. కార్యక్రమంలో స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్ పాల్గొన్నారు.

కస్తూర్బాపాఠశాల తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను సోమవారం స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.అనురాధ (డిప్యూటీ డైరెక్టరు) ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులతో ఆమె సమావేశమై స్థితిగతులు తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో ఏ విధంగా విద్యాబోధన చెబుతున్నారని, ప్రతిరోజూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మెనూ సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే రాబోవు పదవ తరగతి పరీక్షలల్లో మండలంలో మొదటిస్థానంలో పాఠశాలను నిలపాలని అధ్యాపకులకు సూచించారు. అలాగే పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న ఇంటర్మీడియట్ కళాశాల భవనాలను కూడా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి ఆమె మధ్యాహ్న భోజనాన్ని భోంచేశారు. ఎంఈవో పుల్లయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

రిమ్స్ పీజీ వైద్య విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో రాష్ట్రస్థాయి 28వ మైక్రో బయాలజీ విజ్ఞాన సదస్సు ఈనెల 10, 11 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సదస్సులో కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) మైక్రో బయాలజీ పీజీ విద్యార్థులు ద్వితీయ సంవత్సరానికి చెందిన డాక్టర్ దావూద్ సుహేల్ పెడగాగి విభాగంలో ద్వితీయ స్థానం, మొదటి సంవత్సరం పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ మైథిలి జనరల్ క్రిటికల్ థింకింగ్‌లో తృతీయ స్థానం సాధించారు. వీరిని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జమున, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

అనుమానాస్పద మృతి కాదు.. హత్యే

- కుమారుని మృతిపై తండ్రి ఫిర్యాదు
- విచారణకు ఎస్పీ ఆదేశం
- హత్యగా తేల్చిన వైనం

పెండ్లిమర్రి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి పోలీసు స్టేషన్ పరిధిలో అనుమానాస్పద మృతిగా నమోదైన కేసును హత్యగా తేల్చారు. స్థానిక పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నించగా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ప్రత్యేకంగా విచారణ చేయించడంతో సైనైడ్ మర్డర్‌గా తేలింది. చివరికి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. పెండ్లిమర్రి మండలం ఎం.చౌటుపల్లెకు చెందిన సుబ్బయ్య (46) ఈ ఏడాది మార్చి 29న రాత్రి 9గంటల ప్రాంతంలో మృతి చెందాడు. అప్పట్లో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. కనీసం అనుమానాస్పదంగా ఎలా మృతి చెందాడో కూడా పోలీసులు తేల్చలేదు. దీంతో తన కుమారుడిది అను మానాస్పద మృతి కాదని హత్య అని భావించిన మృతుడి తండ్రి పీజీఆర్‌ఎస్‌లో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేశారు. కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఎస్పీ ఓ డీఎస్పీ ద్వారా విచారణ చేయించారు. అయితే ఇది అనుమానాస్పద మృతి కాదని, సైనేడ్ కలిపి హత్య చేశారని నిర్ధారించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పెండ్లిమర్రి సీఐ చల్లని దొర విచారణ చేయించి నిందితులను అరెస్టు చేశారు. చౌటుపల్లెకు చెందిన మృతుడు సుబ్బయ్య అదే గ్రామానికి చెందిన బాల అంకిరెడ్డి సతీమణిని వేధించేవాడు. దీంతో ఎలాగైనా సుబ్బయ్యను మట్టుబెట్టాలని నిర్ణయించాడు. ఆరవేటి మాచనూరు గంగిరెడ్డి సూచనల మేరకు మద్యంలో సైనెడ్ కలిపి చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో మార్చి 29న బాల అంకిరెడ్డి మరి కొందరు మద్యం తాగుతుండగా ఆ సమయానికి సుబ్బయ్య అక్కడికి వచ్చారు. తనకు మద్యం కావాలని అడగ్గా సైనైడ్ కలిపిన మద్యాన్ని ఇచ్చారు. అది తాగి సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందారు. విచారణలో అంకిరెడ్డిని, గంగిరెడ్డిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు.

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్ పరిధిలో పెన్నానది బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో నంద్యాల-రేణిగుంట్ల డెమో రైలుకింద పడి మరణించాడు. అతని వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని చెబుతున్నారు. రైలు కమ్మిమీద తల పెట్టి పడుకోవడంతో తల మొండెంతో వేరైంది. తల కూడా గుర్తు పట్టని తీరులో ఎగిరి పడింది. అతను చొక్కా లుంగీ ధరించి ఉన్నాడని, ఎరుపు తెలుపు గల్ల రంగు టవల్‌తో పడి వున్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ హౌస్ ఆఫీసర్ 9700675792 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ప్రియురాలు పెళ్లికి ఒప్పుకోలేదని...

- కత్తితో కోసుకున్న ప్రియుడు

పులివెందుల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకునేందుకు ప్రియురాలు ఒప్పుకోలేదని ఓ ప్రేమికుడు కత్తితో తన ఒంటిపై పలు చోట్ల కోసుకున్నాడు. విషయం తెలుసుకున్న బంధువులు ఆసుపత్రికి తరలించారు. వివరాల్లోకెళితే.... పులివెందులలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఓ విద్యార్థిని హాస్టల్‌లో ఉంటూ మొదటి సంవత్సరం చదువుకుంటోంది. మరో కళాశాలలో డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థి ఇరువురు కొన్నిరోజులుగా ప్రేమించుకుంటున్నారు. సోమవారం రాజారెడ్డి పార్క్ సమీపంలో ఉన్న హాస్టల్ వద్దకు వచ్చి ప్రియురాలిని పిలిచాడు. కానీ ఆ ప్రియురాలు బయటకు రాలేదు. దీంతో ఆమె బంధువు సోదరి అయిన మహిళ వచ్చి ఆ విద్యార్థిని రాజారెడ్డిపార్క్ వద్దకు పిలుచు కెళ్లింది. ఇరువురిని పెళ్లికి ఒప్పించేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. కానీ ఆ విద్యార్థిని పెళ్లికి ఒప్పుకోకుండా తిరిగి హాస్టల్‌కు వెళ్లిపోయింది. దీంతో ప్రేయసికోసం ఒంటిపై పలుచోట్ల కోసుకున్నాడు. రక్తగాయాలతో వెళ్లిన అతన్ని చూసి చూసిన చుట్టుపక్కలవారు, స్నేహితులు కలిసి ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని హాస్టల్ వార్డన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. జరిగిన సంఘటన గురించి విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో హాస్టల్ వద్దని లెటర్ రాసి ఆ విద్యార్థినిని ఇంటికి తీసుకెళ్లినట్లు వార్డన్ పేర్కొంది.

చోరీ కేసులో దొంగ అరెస్టు

జమ్మలమడుగు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని కాపు వీధిలో నివశిస్తున్న బ్యాంకు ఉద్యోగి బండి మనోహర్ ఇంటిలో ఈ నెల 1వ తేదీ చోరీ జరిగింది. బాధితుడు అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసి సోమవారం గూడెంచెరువుకు చెందిన మెరుగు బాబు అనే యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. అతని వద్ద నుంచి ఒక బంగారు చెయిన్, చిన్న ఉంగరం స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

వేంపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప రోడ్డులో అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహిస్తున్న విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు అతనిపై ఫిర్యాదు రావడంతో డీఎస్పీ మురళి నాయక్ ఆదేశాలతో విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి, నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశామన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధిలో సెక్రటరీలదే కీలక పాత్ర

- డీపీవో రాజ్యలక్ష్మి

కడప రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ అభివృద్ధిలో సెక్రటరీలదే కీలక పాత్ర అని పంచాయతీశాఖ జిల్లా అధికారి (డీపీవో) రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో గ్రామ పంచాయతీ సొంత ఆదాయ వనరుల సృష్టి అనే అంశంపై పంచాయతీ సెక్రటరీలకు శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలు పంచాయతీ పరిధిలోని వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకొని తద్వారా పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. గ్రామ పంచాయతీలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్ది తద్వారా స్వచ్ఛాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పల్లె సీమల ప్రగతికి పెద్ద పీట వేస్తున్నాయన్నారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఏఏ వనరులు ఉన్నాయి, వాటి ద్వారా ఆదాయాన్ని ఎలా సృష్టించుకోవాలి, సమకూరిన నిధులతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో రాజ్యలక్ష్మి

కార్యక్రమాలను ఎలా చేపట్టాలన్న అంశాలను తెలియపరిచారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, ట్రైనింగ్ మేనేజర్ సురేష్, ఉమ్మడి కడప జిల్లా నుంచి 50 మంది టాట్స్ మాస్టర్ ట్రైనర్లు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువులపై అవగాహన కల్పించాలి



తాడిగొట్లలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన కృషి అనుభవ కార్యక్రమం

సీకేదిన్నె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలని డాట్ సెంటర్ సమన్వయకర్త క్రిష్ణప్రియ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్లలో సోమవారం ఎస్వీ వ్యవసాయ కళాశాల తిరుపతి, ఎస్‌ఎంజీఆర్ వ్యవసాయ కళాశాల ఉదయగిరి విద్యార్థులకు జీవన ఎరువులపై గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు స్థానికంగా, ప్రత్యక్షంగా వ్యవసాయంలో అనుభవం పొందడమేకాకుండా రైతుల్లో స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. రైతులతో చర్చా కార్యక్రమాలు నిర్వహించి వారి అనుభవాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు వ్యవసాయ విద్యార్థులు హర్షిణి, అమీనా, క్రిష్ణ, దుశల, దామిని, తదితరులు పాల్గొన్నారు.

16న ప్రభుత్వ పురుషుల కళాశాలలో మినీ జాబ్‌మేళా

కడప మారుతీనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ గురువారం నగర ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి)లో మినీ జాబ్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ తెలిపారు. ఇందులో హెటేరో ల్యాబ్స్ లిమిటెడ్, ఎన్‌ఐఐటీ, (యాక్సిస్‌బ్యాంక్) నెక్స్‌టెల్ మెటా ప్రయివేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ తదితర సంస్థలు పాల్గొంటున్నాయని కో ఆర్డినేటర్ సీహెచ్ రాము వెల్లడించారు. ఇంటర్, డిగ్రీ, బి.టెక్, మాస్టర్ డిగ్రీ, అండ్ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఇందులో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే ఔత్సాహికులు 4 సెట్స్ బయోడేటా, ఆధార్, పాన్‌కార్డుతో పాటు సర్టిఫికెట్స్ జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9390052901, 9347256400 అనే నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఈ-నామ్‌తో చీనీకి మెరుగైన ధర

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్

పులివెందుల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మార్కెట్ యార్డుకు వచ్చే చీనీ రైతులకు మెరుగైన ధరకోసం ఈ-నామ్ విధానం అమలు చేయబోతున్నామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం అమర్‌నాథ్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మార్కెట్ యార్డులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులివెందులలో చీనీ వ్యాపారంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతంలో వ్యాపారులు సిండికేట్ అయి తక్కువ ధర పాడుతున్నారని రైతుల నుంచి తీవ్ర ఆరోపణలు వచ్చాయన్నారు. ఆ సమయంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పలుమార్లు మార్కెట్ యార్డులోని చీనీవ్యాపారాన్ని పరిశీలించారన్నారు. రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారన్నారు. రెండు నెలలుగా మార్కెట్ యార్డుపై రైతుల్లో సానుకూలత వస్తోందన్నారు. రైతులకు మార్కెట్‌పై నమ్మకం కలిగేందుకు మరిన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగా ఈ-నామ్ మార్కెటింగ్ విధానాన్ని 15వ తేదీ బుధవారం నుంచి అమలు చేయబోతున్నామన్నారు. ఈ విధానానికి ప్రతి ఒక్కరు మొగ్గు చూపితే ఆన్‌లైన్ ద్వారానే వ్యాపారాలు సాగుతాయన్నారు. పులివెందుల మార్కెట్ యార్డులో ఉన్న చీనీకాయలను ముంబై, ఢిల్లీ, చెన్నై తదితర నగరాల నుంచి సైతం వ్యాపారులు కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతులు పంట అమ్మిన వెంటనే డబ్బు చెల్లించే వెసులుబాటు కూడా ఉంటుందన్నారు. ఈ-నామ్ పద్ధతితో రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

మూగబోయిన జీవితం...

- భర్త ఆకస్మిక మరణం
- అనాథలైన భార్య, కూతురు

ప్రొద్దుటూరు/దువ్వూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాపురం గ్రామంలో కాశిపోయిన గంగయ్య ఆకస్మిక మరణంతో ఆ కుటుంబం అనాథగా మారింది. గంగయ్య నాగలక్షుమ్మ దంపతులు దివ్యాంగులు (మూగవారు). వీళ్ల నిరుపేద కుటుంబానికి చెందినవారు. శనివారం ఇంటి నుంచి ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో విధులకు వెళ్లిన గంగయ్య సోమవారం మృతిచెందాడనే విషయం తెలుసుకుని భార్యతోపాటు తొమ్మిదేళ్ల కూతురు మల్లిక శోకసముద్రంలో మునిగిపోయారు. గ్రామంలో మూగదంపతులు రేకుల షెడ్డుతో నిర్మించుకున్న ఇంటిలో నివశిస్తున్నారు. గంగయ్య నీలాపురంలో వ్యవసాయ కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించేవాడు. మూడేళ్ల కిందట ప్రొద్దుటూరు డంపింగ్‌యార్డులో గంగయ్య విధుల్లో చేరినట్లు స్థానికులు తెలిపారు. దీంతో లభిస్తున్న జీతంతో కుటుంబ భారాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం విధులకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకుల్లో ఆందోళన మొదలై వాకబు చేస్తూ వచ్చారు. సోమవారం ఉదయం విధులు నిర్వహించే పరిసరాల్లో బహిర్భూమికి వెళ్లి మృతి చెంది ఉన్నట్లు సమాచారం తెలుసుకుని భార్య, కూతురు బోరున విలపించారు. భర్తను కోల్పోయిన నాగలక్ష్మి, ఆమె కూతురు మల్లిక రోదన అక్కడి చూపరులను కలిచివేసింది.





కాశిపోయిన గంగయ్య (ఫైల్), అనాథలైన భార్య, కూతురు

అనుమానాస్పద స్థితిలో మృతి

ప్రొద్దుటూరు పట్టణంలోని పొట్టిపాడు రోడ్డులోని మున్సిపల్ కంపోస్టుయార్డులో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కాశిబోయిన గంగయ్య (41) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... దువ్వూరు మండలం నీలాపురం గ్రామానికి చెందిన గంగయ్య దివ్యాంగుడు (మూగవారు). దీంతో ఇతనికి బ్యాక్‌లాగ్ కింద మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుడిగా ఉద్యోగం వచ్చింది. శనివారం ఉదయం 7.30 గంటలకు కంపోస్టుయార్డులో డ్యూటీకి వచ్చిన గంగయ్య మధ్యాహ్నం 11 గంటల వరకు విధుల్లో ఉన్నట్లు అక్కడి సిబ్బంది తెలి పారు. 11.30 గంటలకు డ్యూటీ అయిపోగానే ఎవరికి వారు ఇళ్లకు వెళ్లిపోయారు. గంగయ్య శనివారం నీలాపు రంలోని తన ఇంటికి రాకపోవడంతో అతని భార్య, బంధువులు ఆదివారం ప్రొద్దుటూరుకు వచ్చి మున్సిపాలిటీలో విచారించారు. గంగయ్య ఆచూకీ తెలియకపోవడంతో మధ్యాహ్నం రూరల్ పోలీ సు స్టేషన్‌లో బంధువులు మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం కంపోస్టు యార్డులో డోజర్ ఆపరేటర్ బహిర్భూమికి వెళ్లగా.. అక్కడ పురుగులు పట్టిన గంగయ్య మృతదేహాన్ని చూసి మున్సిపల్ అధికారులకు తెలియజేశారు. వెంటనే మున్సిపల్ అధికారులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వగా విచారించారు. గంగయ్య మల విసర్జన కోసం కంపోస్టుయార్డులోని పల్వరైజింగ్ మిషన్ సమీపంలో సందులోకి వెళ్లి గుండెపోటు వచ్చి మరణించి ఉండవచ్చని అను మానం వ్యక్తం చేశారు. అతను మలవిసర్జనకు కూర్చున్న పొజిషన్‌లోనే ముందుకు పడి ఉన్నట్లు గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గంగయ్య భార్య కూడా మూగ చెవిడు వున్న దివ్యాంగురాలు. వీళ్లకు ఒక ఆడబిడ్డ వుంది.

ప్రజలకు ఉపయోగకరంగా సూపర్ జీఎస్టీ



ర్యాలీలో శ్రీనివాసరెడ్డి, కమిషనర్ మనోజ్‌రెడ్డి తదితరులు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 సంస్కరణల భాగంగా సూపర్ జీఎస్టీ-సూపర్ పొదుపు కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం కడప నగరంలో పొట్టి శ్రీరాములు విగ్రహం నుంచి పాత వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస,నగర కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, జీఎస్టీ జాయింట్ కమిషనర్ (స్టేట్ ట్యాక్స్) జి.సుమతి, నగర అధ్యక్షుడు మన్సూర్ అలీ ఖాన్, టీడీపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ అండ్ బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..: కడప నియోజకవర్గానికి చెందిన 7 గురు లబ్ధిదారులకు రూ.5.91లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడుశ్రీనివాసరెడ్డి సోమవారం అందించారు.

జనవరిలో మరో డీఎస్సీ అభినందనీయం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2026లో మరో డీఎస్సీ ప్రకటించడం అభినందనీయమని రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు తెలిపారు. సోమవారం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ చిత్రపటాలకు నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. 2026 టెట్ పరీక్షల అనంతరం మూడు నెలల్లో డీఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మూడు నుంచి సమ్మె

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర వ్యాప్తంగా నవంబరు 3 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె చేపడుతున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు తెలిపారు.సోమవారం కడప నగరం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ మనోజ్‌రెడ్డికి సమ్మె నోటీసు అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటాద్రి,చంద్ర,జనార్ధన, రాజశేఖర్ తదితరులుపాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

వేంపల్లె పట్టణంలో రోడ్డుకు మోక్షం



రాళ్లు,కంపను తొలగిస్తున్న దృశ్యం, రోడ్డు కోసం తోలిన కంకర



వేంపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో కడప-పులివెందుల ప్రధాన రోడ్డులో రెండు సంవత్సరాలుగా పెండింగ్ పడి నిలిచిపోయిన రోడ్డు పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సోమవారం రోడ్డు పనులు చేసేందుకు వీలుగా రోడ్డుపై ఉన్న రాళ్లు, కంపను తొలగించారు. ఇప్పటికే కంకర తోలారు, పనులు చేపట్టారు. రెండేళ్లుగా పెండింగ్ ఉన్నపనుల విషయంపై టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు ముఖ్యమంత్రి, మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా జరిగిన సమావేశంలో కాంట్రాక్టర్‌కు రావాల్సిన బిల్లులు ఇప్పించాం దసరా తర్వాత పనులు చేపడుతారని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి చెప్పారు. ఆ మేరకు కాంట్రాక్టర్ ముందుకొచ్చి పనులు చేపట్టడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరగా పనులుచేస్తే దుమ్ము ధూళి, గుంతల సమస్య తీరుతుందని అంటున్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : పదవీవిరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఇంజనీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి. రంగాచార్యులు డిమాండ్ చేశారు. సోమవారం జడ్పీ కార్యాలయ ఆవరణలోని ఏపీపీఆర్ ఎంఈఏ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యపై సమీక్ష

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అప్సర సర్కిల్ పరిసరప్రాంతాల్లో వర్షంకురిసినప్పుడల్లా వరదనీరు సమస్యలపై ప్రజల ఫిర్యాదుల నేపథ్యంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ప్రాంతాన్ని సందర్శించారు. డ్రైనేజీ శుభ్రత, నీటి నిల్వ సమస్యలపై అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పఠాన్ మన్సూర్ అలీఖాన్, పసుపులేటి గౌతమ్‌కుమార్, బోనం శిలాస్, అందూరి రాజగోపాల్‌రెడ్డి,చిన్నబాబు, బాలకృష్ణారెడ్డి, తుంగా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనుల వేగం పెంచండి



సమస్య విన్నవిస్తున్న జోగిరెడ్డి

పులివెందుల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర హైలెవెల్ కెనాల్ ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్‌చీఫ్ శ్యామ్‌ప్రసాద్‌ను తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి కోరారు. సోమవారం అమరావతిలోని జలసౌధలో జలవనరుల శాఖ కార్యాలయంలో ఆయన ఈఎన్‌సీ శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి పలు విజ్ఞప్తులు చేశారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన కోరారు.

లాభాల కోసమే నకిలీ మద్యం వ్యాపారం

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు, లోకేష్ లాభాలు కోసమే కల్తీ మద్యం వ్యాపారం జరుగుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష ఆరోపించారు. సోమవారం కడపనగరం ప్రకాష్‌నగర్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట వైసీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై ర్యాలీ

పులివెందుల టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో కల్తీ మద్యంపై సోమవారం వైసీపీ కార్యాలయం నుంచి మినీ సెక్రటేరియట్ వరకు ర్యాలీ సాగింది. మినీ సెక్రటేరియట్‌లో ఉన్న ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వేంపల్లె, వేముల జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి పటాకులు అమ్ముకోవాలి

పులివెందుల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు లోబడి పటాకులు అమ్ముకోవాలని డీఎస్పీ మురళీనాయక్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద పటాసుల దుకాణాల యజమానులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల ఏర్పాటు సమయంలో ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఐ సీతారామిరెడ్డి, పటాసుల దుకాణదారులు పాల్గొన్నారు.

సచివాలయం ముట్టడి



కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తాము నివాసముండే ప్రాంతంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో పాలకులు, అధికారులు తీవ్ర జాప్యం చేశారని స్థానికులు సచివాలయాన్ని ముట్టడించారు. కడపనగర పరిధిలోని అలంఖాన్‌పల్లె శ్మశానం డ్రైనేజీ నీటితో నిండిపోయిందన్నారు. దీనిని ఆనుకొని ఉండే దస్తగిరిపేటలోకి మురుగునీరు చేరి దోమలకు ఆవాసంగా నిలించిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

చెన్నూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని వారికి అవసరమైన బ్లౌజులతో పాటు మాస్కులు, ఇతరత్రా కిట్లను అందించడం జరిగింది. ఈ మేరకు సోమవారం పంచాయతీ సర్పంచ్ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి పంపిణీ చేశారు.

పులివెందుల సీడీపీఓగా శోభారాణి

పులివెందుల టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సీడీపీఓగా శోభారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈమె కడప అర్బన్ అడిషనల్ సీడీపీఓగా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. గతంలో వేంపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ సునీత పులివెందుల ఇన్‌చార్జిగా ఉండేవారు.

నకిలీ మద్యం అరికట్టడమే ధ్యేయంగా చర్యలు

పులివెందుల రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం అరికట్టడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పులివెందుల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నకిలీ మద్యంను గుర్తించేందుకు ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్ ద్వారా మద్యంబాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఎక్కడ తయారైంది తదితర పూర్తి వివరాలు యాప్ తెలియజేస్తుందన్నారు. నకిలీ బాటిల్ అయితే వాటి వివరాలు కనిపించవన్నారు.

వడ్ల లారీ దగ్ధం



వీరపునాయునిపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల-వీరపునాయునిపల్లె మార్గమధ్యలోని వెలుగు కార్యాలయం సమీపంలో సోమవారం ఉదయం 4.30గంటల ప్రాంతంలో కమలాపురం నుంచి లారీ వడ్ల లోడుతో బంగారుపేటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు వచ్చాయి. లారీ కాలిపోతుండడంతో ఈ విషయాన్ని వేంపల్లె ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో హుటాహుటిన ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పింది. అప్పటికే లారీలో ఉన్న ధాన్యం పూర్తిగా కాలిపోయింది. డ్రైవర్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఈ విషయమై సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యగా మారిన ఎన్‌హెచ్ రోడ్డు పనులు

చక్రాయపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాయచోటి-వేంపల్లె నేషనల్ హైవే 44 రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాయచోటి నుంచి అద్దాలమర్రి రోడ్డు పనులు చురుగ్గా జరిగాయి. అక్కడి నుంచి దాదాపు రెండు,మూడు కిలోమీటర్లు గండి వరకు సమస్యగా మారింది. ఇటు ఫారెస్టు, అటు నది, మరోవైపుకొండ. ఈ నేపథ్యంలో సోమారం రెవెన్యూ, ఫారెస్టు, దేవదాయ శాఖ, జాతీయ రహదారి అధికారులు సమావేశమై తీవ్రంగా చర్చించారు. ఇంకా ఒక కొలిక్కి రాకపోవడంతో సమస్యగా మారింది. అలాగే గండి దేవస్థానం రాజగోపురం నిర్మించడంతో ఒక రోడ్డు దేవస్థానానికి వెళ్లిపోయింది. మిగిలిన ఒక రోడ్డు సరిపోక రెండో రోడ్డు వేయడానికి స్థలం లేదు. దీనిపై అన్ని శాఖలు చర్చించాయి. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కృష్ణతేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, జిల్లా సర్వేయర్లు శివారెడ్డి, ఫారెస్టు రేంజర్, అధికారులు పాల్గొన్నారు.

వైవీయూ నూతన వీసీని కలిసిన గోవర్ధన్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం కొత్త వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్‌ను టీడీపీ సీనియర్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీని శాలువకప్పి సత్కరించారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాములూరు రెవెన్యూ పంచాయతీలోని 513 సర్వేనెంబర్‌లో కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమి సుమారు 8 ఎకరాలు కబ్జా కాకుండా చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర కోరారు. స్థానిక కలెక్టరేట్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడును కలిసి ఫిర్యాదు చేశారు. సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్,అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉల్లి పంట సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి,పోతిరెడ్డిభాస్కర్‌కోరారు.సోమవారం కడపలోని రైతుసంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంనిర్వహించారు. వారు మాట్లాడారు. జిల్లా ఉల్లి రైతులకు వెంటనే నష్టపరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఆంజనేయస్వామి గుడి ముందు వ్యర్థాలు తొలగింపు



చెన్నూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు హైవేలో బుడ్డాయపల్లె వెళ్లే దారిలోఉన్న ఆంజనేయస్వామి గుడి ముందు విపరీతంగా వ్యర్థాలు పేరుకపోవడంతో ఈ నెల 11న హనుమా కనుమా.. అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గ్రామ పంచాయతీ సిబ్బంది గుడి ముందు కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలను సోమవారం పారిశుధ్య సిబ్బందిచే తొలగింపు చేశారు. చాలా కాలంగా ఈప్రాంతంలో ఉన్న గృహాల నుంచి పలురకాల వ్యర్థాలు గాలికి వచ్చి అవి గుడి ముందు కుప్పలుగా పేరుకుపోయాయి. దీనిపై కథనం రావడంతో పంచాయతీ స్బిబంది తొలగించారు.

క్యాష్ కౌంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

సీకేదిన్నె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు గోల్డ్‌లోన్ క్యాష్ కౌంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరు వ్యవసాయ సహకార సంఘం బ్యాంకులో కొత్తగా గోల్డ్‌లోన్ క్యాష్ కౌంటర్, బ్యాంకు లాకర్ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ప్రత్యేకంగా లోన్లు, ఎడ్యుకేషన్‌లోన్లు, హౌస్‌లోన్ లభిస్తాయన్నారు. పావలా వడ్డీకే లోన్ తీసుకోవచ్చని సకాలంలో చెల్లించి మరింత ఎక్కువ రుణాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు ఛైర్మన్ మన్నూరు సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

'నకిలీ మద్యం సృష్టికర్తలు వైసీపీ నాయకులే'



మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప మారుతీనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా నకిలీ మద్యం విచ్చలవిడిగా ఏరులై పారించిన ఘనత వైసీపీ నాయకులదని టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి ఆరోపించారు. పైపెచ్చు ఇవాళ దొంగే దొంగన్నట్లుగా కూటమి పాలనలో నకిలీ మద్యం విచ్చలవిడిగా లభిస్తుందని ధర్నాలు, నిరసనలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. సోమవారం స్థానిక కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 2019 నుంచి రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని వైసీపీ నాయకులు యథేచ్ఛగా తయారు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆ నకిలీ మద్యం కుంభకోణానికి కారణమైన నిందితులను అరెస్టు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎటువంటి కుంభకోణాలను చంద్రబాబు ఉపేక్షించే ప్రసక్తిలేదన్నారు.కుట్రలు, కుతంత్రాలు వైసీపీ నాయకులు మానుకుంటే మంచిదన్నారు.

ప్రజల భద్రతకు విజిబుల్ పోలీసింగ్

కడప క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు, ప్రజలకు మరింత చేరువ అవుతూ నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా సోమవారం వాహన తనిఖీలు నిర్వహించడం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించి రహదారి భద్రతా నిబంధనల గురించి అవగాహన కల్పిస్తున్నారు.

వీరభద్రస్వామికి రూ.11.48 లక్షల ఆదాయం



హుండీ డబ్బులు లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

చాపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామికి భక్తుల నుంచి రూ.11,48,720 ఆదాయం వచ్చినట్లు ఆ దేవస్థానం ఛైర్మన్ పెరుగు వీరనారాయణ, ఈవో బాలాజీశంకర్ తెలిపారు. సోమవారం ఆలయంలోని హుండీలను లెక్కించారు. ఈ ఏడాది మార్చి 6వ తేదీ నుంచి 13వ తేదీ వరకు డబ్బులు లెక్కించారు. బంగారు 118 గ్రాముల ఒక మిల్లీగ్రాము, వెండి 1కేజీ 800 గ్రాములు ఉన్నట్లు చెప్పారు. నగదు, బంగారాన్ని మైదుకూరులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో జమ చేసినట్లు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు.

వర్షం వస్తే ఆ వీధులు అంతే..!



కుంటను తలపిస్తున్న ఆర్యవైశ్య వీధి



రెడ్డికాలనీలో రోడ్డుపై నిలిచిన నీటిని మోటారుతో తొలగిస్తున్న దృశ్యం

కాశినాయన అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) వర్షం వస్తే చాలు వీధుల్లో నీరునిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. కాశినాయన మండల కేంద్రమైన నర్సాపురం ఏర్పడి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తున్నా కనీస వసతులు కనిపించని పరిస్థితి. ప్రధాన రహదారివెంట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల నుంచి రంపాడు రోడ్డు చివరి వరకు నిర్మించిన డ్రైనేజీ కాలువపై ఏర్పాటు చేసిన సిమెంట్ మూతలు ఎక్కడ బడితే అక్కడ ఇరిగి కాలువలో పడిపోయాయి. రాత్రి వేళల్లో ఆదమరిస్తే కాలువలో పడిపోవాల్సిందే. చిన్నపాటి వర్షం పడినా మురుగు నీరు ముందుకు పోయే మార్గం లేక ఎక్కడి నీరు అక్కడ వీదుల్లో నిలిచిపోయి పలు కాలనీలు మురికి కూపాల్లా దర్శనమిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. మరి కొన్నిచోట్ల అంతర్గత రోడ్లకు ప్రధాన రహదారికి తీవ్రవ్యత్యాసం ఉంది. డ్రైనేజీ కాలువ లేకుండా అంతర్గత రోడ్ల కంటే ప్రధాన రహదారిని ఎత్తులో నిర్మించడంతో వీధుల్లోని వర్షం నీరు బయటికి పోక రోడ్లపైనే రోజుల తరబడి నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి నుంచి వచ్చే దుర్గంధం , దోమల స్వైరవిహారం పలు కాలనీ వాసులు అనారోగ్యం బారీన పడేలా చేస్తోంది. మరి కొన్నికాలనీల్లో నిలిచిన వర్షం నీటిని చిన్న మోటర్లసాయంతో స్థానికులు తొలగించుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం ఓకాలనీలో మురుగునీటిపై ఏర్పడిన వివాదం ఘర్షణకు దారితీసి పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. అలాగే ప్రభుత్వ కార్యాలయాలకు సరైన దారులు లేక అధికారులు, ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక నిధులతో మౌలిక వసతుల కల్పించాలని పలువురు కోరుతున్నారు.

13 గంటల పనివిధానాన్ని విరమించుకోవాలి



పీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రొద్దుటూరు , అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల శ్రమ దోపిడికి కారణమవుతున్న 13 గంటల పనివిధానాన్ని వెంటనే విరమించుకోవాలని ప్రగతి శీల కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో సెప్టెంబరు 19న కూటమి ప్రభుత్వవ తీర్మానం చేసిన 13 గంటల పని విధానాన్ని నిరసిస్తూ ప్రగతి శీల కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాలు ఫాసిస్టు విధానాలు అవలభిస్తున్నాయని విమర్శించారు. .ఎన్డీయే ప్రభుత్వమే దేశంలో 44 కార్మిక హక్కులకు రక్షణగా ఉండే చట్టాలను రద్దు చేసిందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక, కర్షకులు ఐక్యంగా పారాడాలని ఆయన పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం తహసీల్దారు గంగయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీకేఎస్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఏఐటియూసీ నేత శివారెడ్డి, చైతన్య ఆటో యూనియన్ నేతలు ప్రతాప్, శరత్, రసూల్, సుదర్శన్ , మహిళా శక్తి రాష్ట్ర కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, ఆర్‌వీఎస్ కన్వీనర్ హరిత తదితరులు పాల్గొన్నారు.

గతంలో ఉన్న సర్వీసులను పునరుద్ధరించండి



ఆర్టీసీ డీఎం సుబ్బమ్మకు వినతిపత్రం అందజేస్తున్న గండికోట కమిటీ

జమ్మలమడుగు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నుంచి గతంలో ఉన్న సర్వీసులను తిరిగి పునరుద్ధరించాలని గండికోట చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వై.చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఆ మేరకు సోమవారం ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్బమ్మకు ట్రస్టు చైర్మన్, కమిటీ సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ జమ్మలమడుగు డిపో నుంచి శ్రీశైలం, మహానంది, గిద్దలూరు సర్వీసులు ఉండేవని వాటిని తిరిగి పునరుద్ధరించాలన్నారు. గతంలో హైదరాబాదు నుంచి జమ్మలమడుగుకు ఉదయం 8.30 గంటల సమయంలో సర్వీసు ఉండేదని, కరోనా సమయంలో రద్దు చేశారన్నారు. అలాగే తిరుమలకు సర్వీసు ఉండేదని, శిక్షణ పొందిన డ్రైవర్ లేదని రద్దు చేశారన్నారు. ప్రొద్దుటూరు నుంచి బళ్లారి, జమ్మలమడుగు మీదుగా ప్రతిరోజు తెల్లవారుజామున 5 గంటలకు బస్సు సర్వీసు ఉండేదని, కదిరి- కర్నూలుకు వయా జమ్మలమడుగు, ఆళ్లగడ్డ నంద్యాల మీదుగా సర్వీసు ఉండేదన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం తిరిగి సర్వీసులను పునరుద్ధరించాలని దాదాపు 200 మందితో సంతకాల సేకరణ చేసి వినతి పత్రం అందజేశారు. ప్రతి బస్సులో డ్రైవర్ సీటు వెనుకల డిపో మేనేజర్ సెల్ నంబరు వేయాలన్నారు. కార్యక్రమంలో గండికోట ట్రస్టు కార్యదర్శి వి.రాజగోపాల్‌రెడ్డి, సభ్యులు నరేంద్ర, ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు 26 మంది సోమవారం విధుల్లో చేరారు. అయిదుగురు స్కూల్ అసిస్టెంట్లు కాగా 21 మంది సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయులు ఉన్నారు. వారిలో పది మందిని స్కూల్ కాంప్లెక్స్‌కు కేటాయించగా 11 మందిని వివిధ పాఠశాలలకు కేటాయించారు. మండలానికి కేటాయించిన 26 మంది ఉపాధ్యాయులను మున్సిపల్ పాఠశాలలకు కేటాయించారు.

పోరుమామిళ్లలో: మండలంలో నూతనంగా 18 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. వారిని ఎస్టీయూ పోరుమామిళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వారికి అవసరమైన ఫామ్స్‌తో కూడిన ఫైలు అందించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్లయ్య, జయరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గురయ్య, అబ్దుల్‌హసం, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశినాయనలో: మండలానికి ప్రభుత్వం 15 మంది కొత్త ఉపాధ్యాయులను నియమించినట్లు ఎంఈవోలు మహమ్మద్ షఫీ, నిర్మల తెలిపారు.ఆమేరకు నూతన ఉపాధ్యాయులు సోమవారం నర్సాపురం ఎమ్మార్సీ కార్యాలయానికి వచ్చి రిపోర్టు చేసుకొని పాఠశాలలకు వెళ్లారు. కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను మండల యూటీఎఫ్ అధ్యక్షుడు బి.భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జోజయ్య, ఎస్టీయూ నాయకుడు సుబ్రమణ్యం కలిసి అభినందనలు తెలిపారు.

కలసపాడులో: నూతనంగా మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో విధులలో చేరిన ఉపాధ్యాయులకు ఎస్టీయూ నాయకులు సోమవారం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర జిల్లా నాయకులు రమణారెడ్డి, శేఖర్‌బాబు, సత్యనారాయణ, మండల నాయకులు వెంకటరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం కొత్త ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించినట్లు ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో-2 రామాంజనేయరెడ్డి తెలిపారు.ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్లు, క్లస్టర్ ఆంగ్లభాష ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టారు.

చాపాడులో: ప్రభుత్వం కొత్తగా మండలానికి నియమించిన ఏడుగురు ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరినట్లు ఎంఈవో రవిశంకర్ పేర్కొన్నారు. చియ్యపాడు, అన్నవరం, పెద్దగురవలూరు ప్రాథమిక పాఠశాలలకు ఎస్‌జీటీలు, హైస్కూళ్లకు స్కూల్ అసిస్టెంట్లు విధుల్లో చేరారు.

పేదలకు భూ పంపిణీ చేయాలి

కాశినాయన అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) ఆక్రమణలో ఉన్న వందల ఎకరాల ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పలువురు మహిళలతో కలిసి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఎన్నిసార్లు విన్నవించినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని పరిస్థితి ఇలాగే ఉంటే ఈనెల 20న తహసీల్దారు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అన్వేష్, కార్యవర్గ సభ్యులు పోలయ్య వీరయ్య సుదర్శన్‌బాబు వెంకటేష్ మహిళలు పాల్గొన్నారు.

ఖాజీపేటలో చోరీ.. నగదు, వెండి అపహరణ

ఖాజీపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దుంపలగట్టు సమీపంలోగల జగనన్న కాలనీలో పీఎం వెంకటేశ్వర్లు ఇంటిలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. వెంకటేశ్వర్లు మనువడు సాయితరుణ్ కథనం మేరకు గత నెల రోజుల నుంచి మా తాత వెంకటేశ్వర్లు అనారోగ్యంతో కర్నూలులో చికిత్స పొందుతున్నాడని సోమవారం పక్కింటివారు చూసి ఇంటికి తాళాలు పగులకొట్టి ఉన్నాయని తెలుపడంతో వచ్చి చూసేసరికి తలుపులకు వేసిన తాళం పగులకొట్టి ఇంటిలోగల రూ.20 వేలు నగదు, వెండి ప్రమిద ఒకటి, రెండ్లు ప్లేట్లు, ఒక గ్లాసు, చిన్న చెంబు తీసుకెళ్లారని, వాటి విలువ రూ.30 వేలు ఉంటుందన్నారు. ఇంటిలో అంతా కారంపొడి చల్లి వస్తువులు చెల్లాచెదురు చేశారని ఆమేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొండశింగరాయ భూముల కౌలుకు వేలం

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లయ్యపల్లెలో వెలసియున్న కొండా శింగరాయ స్వామి దేవస్థానం భూములను కౌలుకు దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈనెల 16న వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి రామలింగారెడ్డి తెలిపారు. 16న ఉదయం 10గంటలకు ఈశ్వరీదేవిమఠం దేవస్థానం వద్ద బహిరంగ వేలం ఉంటుందని ఎవరైనా వేలంపాటలో పాడదలచిన వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కార్యనిర్వహణాధికారి రామలింగారెడ్డి తెలిపారు. ఈ వేలంపాటలో భూములు కౌలుకు పాడిన వారికి ఒక సంవత్సరం వరకు పూర్తి హక్కు కలిగిఉంటుందని తెలిపారు. పాటపూర్తయిన వెంటనే హెచ్చుపాటదారుడు పాట పూర్తి చేసిన మొత్తం చెల్లించి రశీదు పొందాలన్నారు. హిందూ మతస్థులు తప్ప అన్యమతస్థులు వేలం పాటలో పాల్గొనరాదని తెలిపారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

జమ్మలమడుగు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఈనెల 16వ తేదీ జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. కర్నూలులో సూపర్‌జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ జరిగే బహిరంగ సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రానున్నారని ఆయన సోమవారం ఫోన్ ద్వారా విలేకర్లకు వివరాలు వెల్లడించారు. బహిరంగ సభపై ప్రత్యేక సమావేశంలో చర్చించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు బీసీ జనార్ధన్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, దామచర్ల సత్య, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారన్నారు.

నకిలీ మద్యంపై సీబీఐతో విచారణ జరిపించాలి

ప్రొద్దుటూరు , అక్టోబయు 13 (ఆంధ్రజ్యోతి) : ములకల చెరువులో బయట పడ్డ నకిలీ మద్యం కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో నకిలీ మద్యంపై మున్సిపల్ పార్కునుంచి ఎక్సైజ్ కార్యాలయం ర్యాలీ చేపట్టి అనంతరం ఎక్సైజ్ సీఐ సురేంద్రనాథ్‌రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

బద్వేలులో: నకిలీ మద్యం బారీ నుంచి ప్రజల ప్రాణాలు కాపాడాలని వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డిలు హాజరయ్యారు. సోమవారం పట్టణంలో ర్యాలీ చేపట్టి అనంతరం ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నాయకులు పోలిరెడ్డి, శ్రీనయ్య, యద్దారెడ్డి పాల్గొన్నారు.

రాచమల్లు అవినీతి గురించి అందరికీ తెలిసిందే..

● టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ డాక్టర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి



ప్రొద్దుటూరు , అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అవినీతి సామ్రాజ్యం గురించి ప్రజలందరికీ తెలుసునని ప్రెస్‌మీట్‌లు పెట్టి బేరసాలాడి ఒప్పందాలు కుదుర్చుకునే బాపతు అని టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాచమల్లు ఐదేళ్ల వైసీపీ పాలనలో క్రికెట్ బెట్టింగ్ గ్యాంబ్లింగ్ భూకబ్జాలతో వేల కోట్లు సంపాదించాడన్నారు. నేడు ప్రతిపక్షంలో ఉండి ప్రజల పక్షంపై పోరాడకుండా ఇప్పుడు కూడా అక్రమార్జనకేపాల్పడుతున్నారని ధ్వజమె త్తారు. ఎగ్జిబిషన్‌లో దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు చేయడం మాని ప్రతి పక్షనాయ కుడిగా ప్రజల తరుపున పోరాడాలని ఆయన హితవు పలికారు. ఇప్పటికైనా రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, బంగారు రెడ్డిలు ప్రతిపక్ష పాత్ర పోషించే అర్హత లేనివాళ్లని ఒప్పుకోవాలని ఆయన మరోసారి హెచ్చరించారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించండి

కొండాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండాపురం పట్టణంలో శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయుకులతో పాటు పలువురు గ్రామస్థులు కోరారు. ఈ సందర్భంగా వారు సోమవారం తహసీల్దార్ గురప్పకు వినతిపత్రం అందజేశారు. కొండాపురం పట్టణంలో శ్మశానవాటిక లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దహనసంస్కారలు, అంత్యక్రియల నిర్వహణకు ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. అదేవిధంగా వైకుంఠ రథం పెట్టుకోవడానికి బైపాస్‌లో రెండు సెంట్ల స్థలం కేటాయించాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మనోహర్ బాబు, వెంకటరమణ, రిటైర్డు టీచర్ ఓబులేసు, సుబ్బారావు, ప్రసాదు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

బి.కోడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండల వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలను ధరించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు అడుగుతున్న న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే వైద్యులు గ్రామీణ దూర ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులతో సేవలకు సరైన గుర్తింపు, ప్రోత్సాహం లేకపోవడం బాధాకరమన్నారు.

సమ్మెకు సిద్ధమవుతున్న విద్యుత్ ఉద్యోగులు

ఎర్రగుంట్ల అక్టోబర్13(ఆంధ్రజ్యోతి):విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 15 వ తేదీ నుంచి సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని స్ట్రగుల్ కమిటీ ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి పేర్కొన్నారు.ఆర్టీపీపీ మెయిన్ గేటు వద్ద సోమవారం సమ్మెకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను అనేక మార్లు విద్యుత్ యాజమాన్యం,విద్యుత్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కానీ స్పందనలేదన్నారు. కాంట్రాక్టు కార్మికులకు డైరెక్టు పేమెంట్ ఇవ్వాలని ఏళ్ల తరబడి కోరుతున్న పరిష్కరించలేదన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టీపీపీ స్ట్రగుల్ కమిటీ నాయకులు వెంకటస్వామి, గంగయ్య, గిరిబాబు,శేఖర్, కొండారెడ్డి, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తీసుకునోళ్లకు తీసుకున్నన్ని ఎర్రగడ్డలు

దువ్వూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పొలం నుంచి ఎర్రగడ్డలు తీసుకున్నోళ్లకు తీసుకున్నన్ని దక్కుతున్నాయి. పెద్దబళ్లారి రకం ఉల్లిని సాగు చేసిన రైతులు పొలంలోనే వదిలేస్తున్నారు. ఈ తరహా దుస్థితి దువ్వూరు మండలంలో ఎక్కువగా కనపడుతోంది. ప్రస్తుతం మూడిండ్లపల్లె పొలంలో ఈ తరహా సంఘటనలు కనబడుతున్నాయి. ఇది వరకు చల్లబసాయిపల్లె పొలంలో రుద్రారెడ్డి అనే రైతు పంట తీసి పొలంలోనే వదిలేయడంతో వాటిని ఆయా గ్రామ ప్రజలు తీసుకెళ్లడం జరిగింది. ఇలా మండలంలో చేతికందిన పెద్దబళ్లారిని ధర లేక నేలలోనే వదిలేస్తున్న సంఘటనలు రోజు రోజుకు పెరుగుతున్నా ప్రజాప్రతినిదులకు, ఇటు అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని సంబంధిత రైతులు వాపోతున్నారు.

జీఎస్టీ అవగాహనపై బైక్ ర్యాలీ

బద్వేలు ,అక్టోబర్ 13, ఆంధ్రజ్యోతి : సూపర్ జీఎస్టీ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ సోమవారం అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి ఆర్డీవో చంద్రమోహన్ బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలు మాట్లాడుతూ తగ్గిన రేట్ల ప్రకారం అమ్మకాలు జరపాలని, జీఎస్టీ రేట్లు పట్టిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వస్తువులు ధరలు కూడా బోర్డుపై ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు ఉదయభాస్కర్‌రాజు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్‌లో: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించడం వలన ప్రజలకు ప్రయోజనం కలుగుతోందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గురుమూర్తి రెడ్డి తెలిపారు. కళాశాలలో ఈనెల 7 నుండి 13వ తేదీ వరకు సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్, జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

భూ ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోండి



తహసీల్దారు వెంకటసుబ్బయ్యకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

కాశినాయన అక్టోబరు13(ఆంధ్రజ్యోతి) గొంటువారిపల్లెకు చెందిన కందుల నడిపి చెన్నారెడ్డి సర్వే నెంబర్ 72-1 లోని 5 మందికి చెందిన 0.48 సెంట్ల ఇంటి స్థలాల భూమిని తప్పుడు పత్రాలు సృష్టించి ఆన్‌లైన్ ఎక్కించు కొని రిజిష్టర్ చేయించుకున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని కందుల చెన్నారెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు దుగ్గిరెడ్డి, కొండా రామసుబ్బారెడ్డిలు తహసీల్దారు వెంకటసుబ్బయ్యకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు వినతిపత్రం ద్వారా సమస్యను విన్నవించారు. తనకు వారసత్వంగా వచ్చిన 0.9 సెంట్ల భూమి కూడా అందులో ఉందని కొనుగోలు చేసిన భూమిని వారసత్వం కింద సంక్రమించినట్లు రికార్డులు మార్చి కందుల నడిపి చెన్నారెడ్డి పేరున మొదట రిజిష్టరు చేయించు కొని అనంతరం గిఫ్ట్ డీడ్ కింద కుమారునికి రిజిష్టర్ మార్చాడని వారు ఆరోపించారు. ఈవిషయంపై తహసీల్దారు వెంకటసుబ్బయ్యను వివరణకోరగా గత నెలలో సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే బద్వేల్ సబ్ రిజిష్టర్ కార్యాలయానికి లెటర్ కూడా పెట్టా మని దీనిపై ఆర్డీవోకు నివేదిక పంపామన్నారు.

బాలికల సంరక్షణ మనందరి బాధ్యత



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో గీత

ప్రొద్దుటూరు , అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికల సంరక్షణ మనందరి బాధ్యత అని డిప్యూటి డిఎంహెచ్‌వో డాక్టర్ గీత పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గీత బాలికల జూనియర్ కళాశాలలో బాలికలను కాపాడండి పేరుతో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ గీత మాట్లాడుతూ బాలికలను కాపాడండి అనే నినాదం సమాజంలో ఆడపిల్లల రక్షణ విద్య సమాన హక్కుల కోసం నడిపే ఉద్యమ మన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ జయరాముడు, వైద్యాధికారి హిమబిం దు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, శోభారాణి సీహో సుబ్బారెడ్డిలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఏపీహెచ్ఐవీ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. యువత పచ్చబొట్లకు దూరంగా ఉండాలని సూచించారు.